ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 5 జూలై 2024



లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక



రంగారెడ్డి అర్బన్, జూలై 4 : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ప్రవేశానికి గురువారం జిల్లా కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో డే స్కాలర్స్‌గా 138 మంది విద్యార్థులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు లాటరీ ద్వారా ఎంపిక చేశారు. అలాగే 5వ తరగతిలో రెసిడెన్సియల్‌గా 134 మంది ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేశారు.



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



వన మహోత్సవానికి జిల్లా సిద్ధమైంది. వర్షాకాలంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ నెల మొదటి వారంలో మొక్కలు నాటేలా ప్లాన్ చేసింది. నర్సరీల్లో మొక్కలు కూడా రెడీగా ఉన్నాయి. అయితే, ప్రతీ ఏడాది పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి తర్వాత వాటి సంరక్షణను పట్టించుకోకపోవడంతో చాలావరకు ఎండిపోతున్నాయి. దీనికి తోడు చాలా మొక్కలు వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని కొంతమేర తగ్గించారు. నాటిన వాటినన్నింటినీ సంరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- ఈసారి 82.599 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- గత ఏడాది కంటే స్వల్పంగా తగ్గిన టార్గెట్
- జిల్లాలోని 558 నర్సరీల్లో రెడీగా ఉన్న మొక్కలు
- శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం, ఈసారి వృథా తగ్గింపు
- గుంతలు సిద్ధం చేస్తున్న అధికారులు
- జూలై మొదటి వారంలో వన మహోత్సవం

వన మహోత్సవానికి సన్నద్ధం

తొమ్మిదేళ్లుగా నాటిన మొక్కలు (లక్షల్లో)

సంవత్సరం	నాటిన మొక్కలు
2015	73.78
2016	73.78
2017	139.24
2018	71.041
2019	86.12
2020	105.429
2021	102.745
2022	89.248
2023	82.790
2024	82.599 లక్ష్యం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 4 : రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. గత ప్రభుత్వం తెలంగాణ హరితహారం పేరుతో తొమ్మిది విడతలుగా కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటనుంది. ఇందులో భాగంగానే ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అన్ని శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో జూలై మొదటి వారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రాష్ట్రంలో 24శాతం నుంచి 33 శాతం వరకు గత ప్రభుత్వంలో పచ్చదనం లక్ష్యం పెరిగింది. జిల్లాలో 50,3100 హెక్టార్ల భౌగోళిక ప్రాంతం ఉంది. అందులో అటవీ భూములు 29,545.90 హెక్టార్లున్నాయి. ఇది కేవలం 5.87 మాత్రమే. పెద్ద ఎత్తున పట్టణీకరణ, పెరిగిన కాలుష్య స్థాయిల దృష్ట్యా జిల్లాలో మన మహోత్సవం కార్యక్రమానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. అయితే ఏటా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మొక్కలు కనిపించడం లేదు. ఇలాంటి నేపథ్యంలో పదోసారి మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తం 558 గ్రామ పంచాయతీలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. మూడేళ్ల నుంచి మొక్కలు నాటే లక్ష్యం తగ్గుతూ వస్తుంది. 2021లో 102.745 లక్షల మొక్కలు నాటగా 2022లో 89.248 లక్షలు నాటారు. ఇలా ఏటేటా లక్ష్యం తగ్గుతూ వస్తుంది. కానీ.. ఈ సారి లక్ష్యం కాస్త పెరిగింది. 2024 సంవత్సరంలో 82.599 లక్షలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఈసారి కొన్ని శాఖల్లోనే..

జిల్లాలో 40 శాఖలపైనే ఉండగా.. కేవలం 18 శాఖల్లోనే వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. మిగతా శాఖల్లో ఈసారి ఎందుకు నాటడం లేదో తెలియడం లేదు. దీనిపై అధికారులు కూడా వివరణ ఇవ్వడం లేదని ప్రచారం సాగుతోంది. ప్రతీసారి హరితహారంలో లక్ష్యం భారీగా నిర్ణయిస్తున్నారు. కానీ.. నాటడంలో మాత్రం లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది. మొక్కలు నాటుతున్నా వాటిని సంరక్షించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వృథా తగ్గింపు...!

గత 9 దఫాలుగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో మొక్కల వృథా 50శాతం కంటే ఎక్కువగా ఉన్నట్లు కింది స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా గ్రామాల వారీగా లక్ష్యాలను ఇచ్చి మొక్కలు పెంచేవారు. వాటిని గ్రామాలకు తరలించేందుకు భారీగా నిధులు ఖర్చయ్యేవి. నాటేందుకు సరైన స్థలాలు లేక మొక్కుబడిగా నాటేవారు. ఎందుకంటే ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలాల్లో మొదటి, రెండు, మూడో విడతల్లోనే మొక్కలు నాటారు. అదే స్థానంలో నాటాలంటే పాతవాటిని తీసేసి కొత్తవి నాటాల్సిన పరిస్థితి. దాంతో పాటు చాలా మొక్కలను ఇంటింటికీ ఇచ్చినట్లు రాసుకుని ఎక్కడ బడితే అక్కడ వదిలేసేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఈసారి లక్ష్యాలను భారీగా తగ్గించారు. దీంతో ఎక్కడ అవసరమో అక్కడే కొద్ది స్థాయిలో మొక్కలు నాటేందుకు అవకాశముంది.

శాఖల వారీగా లక్ష్యం నిర్దేశం..

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించారు. గత ఏడాది హరితహారం లక్ష్యం 78.665 లక్షలు నిర్దేశించగా 82.790 లక్షలు నాటినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. లక్ష్యానికి మించి మొక్కలు నాటినట్లు చెబుతున్నారు.. కానీ.. క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఈ సారి లక్ష్యం 82.599 లక్షలు మొక్కలు నాటాలని నిర్దేశించారు. అందులో అత్యధికంగా డీఆర్‌డీఏ శాఖకు 33.075 లక్షలు, తర్వాత మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల్లో 25.159 లక్షలు, అటవీశాఖ పరిధిలో 8.820 లక్షలు నాటాలని నిర్దేశించారు.

నాటేందుకు మొక్కలు సిద్ధం

జిల్లాలో పదో విడతలో నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు ఇచ్చి వాటిని నాటేందుకు అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ప్రజలు అడిగిన మొక్కలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు. మునగ, కానుగ, తులసి, ఈతతో పాటు ఔషధ, పూల మొక్కలను కూడా సిద్ధం చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపుల, పొలం, చెరువుగట్టు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలల ఆవరణలో నాటేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. దీంతో పాటు అటవీ ప్రాంతాల్లో మరింత ఆహ్లాదాన్ని పెంచే విధంగా పలు పూల, పండ్ల మొక్కలను నాటేందుకు సిద్ధమవుతున్నారు.

జూలై మొదటి వారంలో మనమహోత్సవం

"ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. భూమి నానుతుంది. జూలై మొదటి వారంలో వనమహోత్సవం పేరట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. డీఆర్‌డీఏ, అటవీ శాఖ పరిధిలో నిర్వహించే వన మహోత్సవానికి ఇప్పటికే శాఖల వారీగా మొక్కల టార్గెట్ నిర్దేశించాం. ప్రతీ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి."

- డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

శాఖల వారీగా లక్ష్యం.. (లక్షల్లో)

శాఖ	లక్ష్యం
అటవీ	8.820
విద్య	0.27
వైద్యం	0.110
పరిశ్రమలు	2.756
ఉద్యానవన	1.103
దేవాదాయ	0.110
సాంఘిక సంక్షేమ	0.110
గిరిజన సంక్షేమ	0.055
మైనింగ్	0.276
మార్కెటింగ్	0.110
పౌర సరఫరాల	0.055
గ్రామీణాభివృద్ధి	33.075
పంచాయతీరాజ్	5.513
వ్యవసాయం	3.308
నీటి పారుదల	0.110
ఎక్సైజ్ (సరూర్‌నగర్)	0.551
ఎక్సైజ్ (శంషాబాద్)	0.551

మున్సిపాలిటీలు..

షాద్‌నగర్	1.103
పెద్ద అంబర్‌పేట్	1.103
బడంగ్‌పేట్	2.205
మీర్‌పేట్	0.500
ఇబ్రహీంపట్నం	1.103
జల్‌పల్లి	1.103
కొత్తూరు	0.400
శంకర్‌పల్లి	1.103
ఆదిభట్ల	2.205
తుక్కుగూడ	2.205
ఆమనగల్లు	2.205
నార్సింగి	1.103
మణికొండ	2.205
శంషాబాద్	1.654
తుర్కయంజాల్	3.308

జిల్లాలో మొదటి, చివరి విడత హరితహారంలో పాల్గొన్న కేసీఆర్

హరితహారం మొదటి విడతలో అప్పటి సీఎం కేసీఆర్ చిలుకూరులో పాల్గొన్నారు. 2023లో జరిగిన కార్యక్రమంలో తుమ్మలూరులో పాల్గొన్నారు. హరితహారం కార్యక్రమాన్ని తెలంగాణ హరితహారం పేరిట 2015లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జూలై 3న చిలుకూరు బాలాజీ దేవాలయంలో అధికారికంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు 9 పర్యాయాలు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమాన్ని 2023 జూన్ 19న మహేశ్వరం మండలం తుమ్మలూరులోని అర్బన్ ఫారెస్ట్‌లో జరిగింది. ఈ కార్యక్రమాన్ని కూడా కేసీఆర్ మొక్కను నాటి ప్రారంభించారు.



2015లో చిలుకూరులో మొక్క నాటుతున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్

దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలి: కలెక్టర్



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, జూలై 4 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బీసీ సంక్షేమాధికారి నీరజరెడ్డి, ఏవో నర్సింహారావు, బీసీ ఫ్రంట్ చైర్మన్ గోరిగే మల్లేష్ కురుమ, కేవైసీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ కురుమ, కేవైసీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి కుండే కృష్ణ, రాజేందర్ కురుమ, పర్వతాలు, శేఖర్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పరిషత్‌లలో ప్రత్యేక పాలన షురూ!

- బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత
- బీసీ కులగణన తర్వాతే నిర్వహణ?

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 4 : జిల్లా, మండల పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలన షురూ అయింది. మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో 'ప్రత్యేక' అధికారుల పాలనకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గురువారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు అధికారుల చేతుల్లోకి వెళ్లాయి. ప్రజల ఓట్లతో ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా ఎన్నికై ఐదేళ్ల పాటు సేవలు అందించిన సభ్యులు ఇక నుంచి 'మాజీ'లు అయ్యారు. పాలనా వ్యవహారాల్లో ఇకపై వారి జోక్యం ఉండబోదు. మండల, జిల్లా పరిషత్‌లకు వచ్చే నిధులు ఖర్చు, ఇతర పాలనాపరమైన అంశాలను మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు కేటాయించిన అధికారులే పర్యవేక్షిస్తారు. జిల్లాలో 21 మండల పరిషత్‌లు, 257 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 21 మంది ఎంపీపీలు, 21 మంది జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాలక వర్గాల నిర్ణీత గడువు కంటే రెండు నెలలు ముందుగానే అప్పటి ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించింది. కానీ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వీటి నిర్వహణకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడక పోవడంతో సర్పంచ్‌ల తరహాలోనే ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది.

'పొడిగింపు'పై ఆశలు గల్లంతు

తమ పదవీకాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తారని భావించిన ఎంపీటీసీ, జడ్పీటీసీల ఆశలను ప్రభుత్వం అడియాశలు చేసింది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో తమ పదవీకాలాన్ని పెంచుతారని సభ్యులు భావించారు. కానీ ప్రభుత్వం ఎలాంటి పొడిగింపు ఇవ్వకుండా 'ప్రత్యేక' పాలనకే మొగ్గుచూపింది. పదవీకాలాన్ని పెంచాలంటూ రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా పరిషత్ సభ్యుల నుంచి ప్రభుత్వానికి వినతులు సైతం వెళ్లాయి. ఇప్పట్లో ఎన్నికలు లేనందున తమను మరికొంత కాలం కొనసాగించాలంటూ విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందాయి. కానీ ప్రభుత్వం వాటిని లెక్కలోకి తీసుకోలేదు.



యాచారం మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ రమణి

ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే..

ప్రత్యేక అధికారులను నియమించడంతో మండల, జిల్లా పరిషత్తులతో పాటు సర్పంచు స్థానాలకు సైతం ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కనిపించడం లేదు. సర్పంచుల పద వీకాలం జనవరి నెలలో ముగియగా ఆ లోపే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ.. రాష్ట్రంలో అప్పుడే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో సమయం లేకపోవడంతో ఆ దిశగా ప్రభుత్వం అడుగు వేయలేదు. ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించాలని భావించగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇదే క్రమంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం దగ్గర పడినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఎన్నికలకు వెళ్లలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కావడం, రాజకీయంగా కొంత అస్థిరత ఉన్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని అధికార కాంగ్రెస్ భావించింది. దీనితో పాటు రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల మార్పు, బీసీ కుల గణన వంటి అంశాలు ఎన్నికలను వాయిదా వేయడానికి కారణంగా మారాయి.

ప్రత్యేకాధికారుల వివరాలు

మండలం	ప్రత్యేకాధికారి	మొబైల్ నెంబర్
ఆమనగల్లు	సుజాత, ఏడీఏ, మహేశ్వరం	7288894677
అబ్దుల్లాపూర్‌మెట్	గోవిందరావు, డీడీ, వయోజన విద్య	9849909215
చేవెళ్ల	ఎ.సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి	9493828469
చౌదరిగూడెం	యెంక్యానాయక్, డీఐఈవో	9848018284
ఇబ్రహీంపట్నం	నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి	7993357068
కందుకూరు	వెంకట్, జిల్లా ఆడిట్ అధికారి	9912545221
కడ్తాల్	రామేశ్వరి, జిల్లా గిరిజనశాఖ అధికారి	9490957029
కేశంపేట్	టి.రాజారత్నం, ఏడీఏ, షాద్‌నగర్	7288894307
కొందుర్గు	రియాజ్, జిల్లా మార్కెటింగ్ అధికారి	7330733144
కొత్తూరు	కె. లీన, ఏడీఏ, రాజేంద్రనగర్	7288894629
మాడ్గుల	నర్సిరెడ్డి, ఏడీ, మైనింగ్	9010933233
మంచాల	ఎన్.సుభాషిణి, జిల్లా ఉపాధిహామీ అధికారి	9281487123
మొయినాబాద్	సి. సంజయ్‌కుమార్, ఏడీ, హార్టికల్చర్	9441110731
మహేశ్వరం	ఎం.శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి	9640909898
నందిగామ	కె. నీరజగాంధీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి	7997725259
షాబాద్	డాక్టర్ కె. విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి	9989932779
శంకర్‌పల్లి	డి. రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల	7288894654
ఫరూక్‌నగర్	జె. రామారావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి	9951111777
శంషాబాద్	యు. ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ	9866248558
తలకొండపల్లి	ఎ. ముత్యాలు, ఏడీ, సెరికల్చర్	9494347289
యాచారం	పద్మజ రమణి, జిల్లా సంక్షేమాధికారి	9440698108

ప్రజాపాలనలో అన్ని ప్రాంతాలకు

సమన్యాయం

- ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, జూలై 4: సామాజిక న్యాయం, సమానత్వం, అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమని, కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్నివర్గాలు, ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి పట్టణాలకు దీటుగా పల్లెలు, గిరిజన తండాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టే బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.5 లక్షలతో నిర్మించిన అంతర్గత కాల్వను ప్రారంభించారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సీఎం పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి నెలరోజుల్లో 35 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరందిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, మార్కెట్ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, తహసీల్దార్ సునీల్, మాజీ సర్పంచ్ యాదమ్మ యాదయ్య, నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిని తన స్వగృహంలో పదవీ విరమణ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే సన్మానించారు.

అపరిచిత వ్యక్తులపై సమాచారమివ్వండి

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు

యాచారం, జూలై 4 : గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే డయల్ 100కు సమాచారమివ్వాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు కుర్మిద్ద గ్రామస్థులకు సూచించారు. కాగా, గ్రామంలో కొన్ని రోజులుగా దొంగలు సంచరించి చోరీలకు యత్నిస్తుండడంతో గ్రామస్థులు కలవరపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆనెమోని రోశయ్య ఇంట్లో చోరీకి యత్నించిన దుండగుల కళ్లలో కుటుంబ సభ్యులు కారం పొడి చల్లిన వైనంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో దొంగల కంట్లో కారం కొట్టి.. చోరులను ఎదుర్కొన్న కుటుంబం... అనే శీర్షికన వచ్చిన కథనంపై హైదరాబాద్ పోలీసులు స్పందించారు. గురువారం సాయంత్రం సీఐ నర్సింహరావు ఆదేశం మేరకు పోలీసులు కుర్మిద్దలో పర్యటించారు. గ్రామంలో చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగల కంట్లో కారంపొడి కొట్టి దుండగులను ఇంట్లోకి రాకుండా అడ్డుకోవడం అభినందనీయమని అన్నారు. దొంగలను ప్రతిఘటిస్తూనే 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారమందించి ఉంటే వారిని సూచించారు. సమాచారమందించిన నిమిషాల వ్యవధిలో గ్రామం చేరుకొని ఆదుకుంటామని వెల్లడించారు. కాగా, రక్షణ కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు పోలీసులను కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కుర్మిద్దలో చోరీలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

● రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 4 : రైతులు పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కవేలిగూడలో పొలాల వద్దకు వెళ్లి రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రైతులు సీబీఈ యాప్ ద్వారా పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఫర్టిలైజర్ షాప్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, బ్లాక్‌లో, గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేయవద్దని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కవిత, ఏఈవో సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


కవేలిగూడలో పంటల వివరాలు నమోదు చేస్తున్న గీతారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


బండలేమూర్‌లో పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి

మంచాల, జూలై 4 : మండల పరిధిలోని బండలేమూర్‌లో రూ.5లక్షల జడ్పీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తన పదవీ కాలం ఈ రోజుతో ముగుస్తుందని తెలిపారు. పేదల కోసం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానన్నారు. మాజీ ఎంపీపీ నర్మదల చ్చిరాం, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్ నాయక్, చంద్రయ్య, కిషన్‌నాయక్, ఐలయ్య, సత్యం తదితరులున్నారు.

దేశవ్యాప్తంగా ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సేవలు

● సంస్థ నిర్వాహకులు డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్, జూలై 4 : రెండు దశబ్దాల క్రితం ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సేవలను దేశంలోని మారుమూల గ్రామాలకు విస్తరించామని ఆ సంస్థ నిర్వాహకులు డాక్టర్ అలోక్ అగర్వాల్ చెప్పారు. ఇదివరకే రంగారెడ్డి జిల్లాల్లోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ, షాబాద్ మండలాల్లో తమ సంస్థ సేవలు అందిస్తుందని చెప్పారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలోలోని తమ కార్యాలయంలో సేవ విస్తరణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూర్గులలో విద్య, వైద్యం, గ్రామ ప్రగతికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలికవసతులు, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం లాంటి సౌకర్యాలను పాఠశాలలో కల్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందించామన్నారు. మహిళల కోసం కుట్టు, బ్యాగుల తయారీ లాంటి పనుల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశామని వివరించారు.


మాట్లాడుతున్న అలోక్ అగర్వాల్

వేంకటేశ్వరుడి సేవలో 'టార్జాన్'

షాద్‌నగర్‌అర్బన్, జూలై 4: షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని గురువారం ప్రముఖ సినీనటుడు టార్జాన్ అలియాస్ లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. షాద్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చిన టార్జాన్ ఆతరువాత మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్‌తో కలిసి ఆలయానికి వచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పరిశీలించి, పురాతన ఆలయానికి పూర్వవైభవం తెచ్చారని అభిప్రాయపడ్డారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని టార్జాన్ హామీ ఇచ్చారు.


సినీనటుడు టార్జాన్‌ను సన్మానించిన ఒగ్గు కిషోర్

చెట్లు పెంచేందుకు దరఖాస్తు చేసుకోవాలి

శంకర్‌పల్లి, జులై 4: ఈత, టేకు చెట్లతో పాటు పండ్ల మొక్కలు పెంచేందుకు ఆసక్తిగా ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా ఎస్సీ ఎస్టీలు, 5ఎకరాల లోపు ఉన్న సన్న చిన్నకారు రైతులు ఈత, టేకు, యూకలిప్టస్(నీలగిరి), మునగ, పండ్ల మొక్కలు మామిడి, జామ తదితర మొక్కలు పెంచుకునేందుకు రైతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని అన్నారు. మొక్కలు పెంచుకున్నందుకు గాను సంరక్షణ చార్జీ ఒక్కో మొక్కకు రూ. 5 చొప్పున రూ. 3వేలకు మించకుండా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమిపై విచారణ చేపట్టాలి

పూడూరు, జూలై 4: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిలో రియల్టర్ల నుంచి కాపాడాలని గ్రామస్థులు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వేనెంబర్-99, 101లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 125ఎకరాల భూమి ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లలో గతం 60ఏళ్ల నుంచి భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం సర్టిఫికెట్లతో భూ పంపిణీ చేసింది. ఎక్స్ సర్వీస్‌మెన్‌ల పేర్లతో రియల్టర్లు భూ దందా చేస్తున్నారని, ఇట్టి భూమిపై విచారణ జరపాలని వారు కోరారు. మిగిలిన భూమికి చెందిన రికార్డులను గతంలో పనిచేసిన మండల రెవెన్యూ అధికారులు, రియల్టర్లు, కొందరు గ్రామస్థులతో కలిసి 2018లో గత రికార్డులను తారుమారు చేశారని వారు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎకరాలకు రూ.2కోట్ల వరకు ధరలు పలుకుతుండటంతో అన్యాక్రాంతమవుతుందని వారు వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి ఇట్టి భూమిపై విచారణ జరిపి, గ్రామ పేదలకు వ్యవసాయానికి గానీ, ఇళ్ల స్థలాల కోసం కానీ కేటాయించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్కెపల్లి గ్రామస్థులు

సీనియార్టీ ఆధారంగా పదోన్నతులు చేపట్టండి

● రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల అప్పీల్ తిరస్కరణ

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలను సీనియార్టీ ప్రకారం చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. ఆ జిల్లాకు చెందిన పలువురు ఎస్జీటీలు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. రంగారెడ్డి జిల్లాకు చాలా మందిని ఇతర జిల్లాల నుంచి బదిలీ చేస్తున్నారని, స్థానికేతర ఉపాధ్యాయుల శాతం 45 శాతానికి మించి పోతోందని పేర్కొంటూ బీ రవి సహా దాదాపు 40 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. క్యాడర్ స్ట్రెంత్ కంటే ఎక్కువ మందిని ఇక్కడికి బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 40 పోస్టులు ఆపి, ఇతర జిల్లాల తరహాలో బదిలీలు చేపట్టవచ్చని చెప్పింది. దీనిపై పిటిషనర్‌లు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేయగా డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించింది. అప్పీల్‌ను కొట్టేసింది.

వర్షానికి కూలిపోయిన ఇల్లు!

● ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

చేవెళ్ల, జూలై 4 : ఇటీవల కురిసిన వర్షానికి చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామంలో ఓ బండల ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన నరేగూడెం నర్సింలు ఇల్లు రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా బుధవారం రాత్రి కూలిపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులెవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంటి యాజమాని నారేగూడెం సుప్రియ, నర్సింలు దంపతులు ఆరేళ్ల క్రితం చనిపోవడంతో వారి పిల్లలను అమ్మమ్మ బేగరి నర్సమ్మ వద్ద ఉంచగా.. ఆమె అదే ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు పూర్తిగా కూలిపోయిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని కొత్త ఇల్లు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


ఆలూర్ గ్రామంలో కూలి ఇల్లు వద్ద నర్సమ్మ, పిల్లలు

అటవీ సంపదను కాపాడుకోవాలి

● జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్


వికారాబాద్: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్

వికారాబాద్, జూలై 4: జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అటవీ సంపదను కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో జిల్లాలో ఈసారి 40.48లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్క బతకాలని, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా అటవీ భూములు అన్యాకాంత్రమవడానికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైనట్లు గుర్తిస్తే వెంటనే రెవెన్యూ, పోలీసు శాఖల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగా అటవీ భూములు ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని, అటవీభూముల చుట్టూ సరిహద్దులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఎఫ్‌ఆర్‌వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీపీవో జయసుధ, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


శంకర్ లాల్ చౌరాసియాను సన్మానిస్తున్న సీడీపీవో నాగమణి

అప్రమత్తతతోనే కల్తీ నియంత్రణ

షాద్‌నగర్ అర్బన్, జూలై 4: ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. ప్రశ్నించినప్పుడే కల్తీ వస్తువుల విక్రయాలు నియంత్రించబడుతాయని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియా తెలిపారు. షాద్‌నగర్ వినియోగదారుల సమాచార కేంద్రంలో గురువారం ఆహార కల్తీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. శంకర్‌లాల్ హాజరై మాట్లాడారు. కల్తీ వస్తువుల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వినియోగదారుల చట్టం-2019 ఉన్నప్పటికీ.. సమాజంలో కల్తీ జరుగుతూనే ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి, ప్రశ్నించినప్పుడే కల్తీ అరికట్టబడుతుందని అభిప్రాయపడ్డారు. ఏ వస్తువులను కొనాలన్న ఎమ్మార్పీతో పాటు ఎక్స్‌పైరీ డేట్‌ను చూడాలని సూచించారు. సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ దిడ్డి గోపాల్‌నారాయణ్ మాట్లాడుతూ మంచి నూనెతో పాటు ఇతర ఆహార వస్తువులను కల్తీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైన కల్తీ జరినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ కల్తీ నివారణ కోసం ప్రజల్లో చైతన్యం తేవడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వినియోగదారుల సంఘం మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధాత్రీదేవి

సహకార సంఘం అభ్యున్నతికి కృషి

మంచాల, జూలై 4 : ప్రత్యేక కార్యాచరణతో సహకార సంఘ అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార సంఘ అధికారి ధాత్రీదేవి తెలిపారు. గురువారం ఏర్పాటుచేసిన మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేష‌యాదవ్, యాదయ్య, పి.రమేష్, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, సీఈవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సీజీఆర్ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పంపిణీ

కడ్తాల్, జూలై 4: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రే కీలకమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధులు విశ్వేశ్వర్ రావు, వర్ధన్, నగేశ్‌లు అన్నారు. మొక్కల పెంపకం ప్రాధాన్యత గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించాలని వారు కోరారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్‌లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఇర్విన్ ఉన్నత పాఠశాలకు 22 రకాల ఔషధ మొక్కలను సమకూర్చారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ నిర్వాహకురాలు లీలాలక్ష్మారెడ్డి వాటిని ఉపాధ్యాయులకు అందజేశారు. గురువారం పాఠశాల ఆవరణలో మెడిసినల్ గార్డెన్ తయారు చేసి విద్యార్థులు ఔషధ మొక్కలను నాటారు. హెచ్ఎం పర్వతాలు, టీచర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

షాద్‌నగర్, జూలై 4: సంక్షేమ వసతి గృహల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వసతిగృహాల ప్రిన్సిపాల్లను ఆదేశించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాంఘిక, గిరిజన, మైనార్టీ, కేజీబీవీ, బీసీ వసతి గృహాల ప్రిన్సిపాల్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహల్లోని విద్యార్థులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎందుర్కొంటూ విద్యనభ్యసిస్తుంటారని, అలాంటి నిరుపేద విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్లపై ఉందన్నారు. వసతిగృహాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందించాలన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై తనకు నివేదిక అందజేయాలని సూచించారు.

కొత్త జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 4: రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొత్త గ్రామ పంచాయతీలలో జాతీయ ఉపాధి హామీ పథకం అమలు కోసం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో గురువారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిసెంట్లుగా పదోన్నతి కల్పించి రూ.24వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జగన్, సీటీయు జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గం కన్వీనర్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రాములు

‘లక్ష్మీదేవిపల్లి’ నిర్మాణానికి నిధులు తెస్తా

- హిందువులపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు బాధించాయి
- పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ

కొత్తూర్, జూలై 4 : షాద్‌నగర్ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించేందుకు నిర్మించతలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలు బాధించాయని ఆమె అన్నారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న డీకే అరుణకు పార్లమెంట్ నియోజకవర్గ ముఖద్వారమైన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజుచారి, మండల శాఖ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. డీకే అరుణ తిమ్మాపూర్‌కు చేరుకోగానే నాయకులు స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అనంతరం పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూర్ చౌరస్తా వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి తోడ్పాటు అందిస్తానని స్పష్టం చేశారు. నిధులు తీసుకొచ్చి పార్లమెంట్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేస్తానన్నారు. రాహుల్‌గాంధీ ఇటీవల పార్లమెంట్‌లో హిందువులపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించిందని డీకే అరుణ గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. ప్రజలు తనపై నమ్మకం పెట్టుకొని ఎంపీగా గెలింపించారని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కారిస్తానని అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్. శ్రీవర్ధన్‌రెడ్డి, డీకే అరుణ, దేపల్లి అశోక్‌గౌడ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, అమడపురం నర్సింహగౌడ్, కమ్మరి భూపాలచారి, భాస్కర్, లక్ష్మణ్, రణధీర్‌గౌడ్, బావండ్ల మాణిక్యం, చెట్ల వెంకటేష్, మల్‌చలం మురళి, వంశీ, వెంకటేష్‌యాదవ్, నర్సింహయాదవ్, ప్రవీణ్, శ్రీశైలంగౌడ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


డీకే అరుణను గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

మండల పరిషత్తుల్లో కొలువుదీరిన ప్రత్యేకాధికారులు

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్తుల్లో ప్రత్యేకాధికారులు కొలువుదీరారు. ఈనెల 3వ తేదీన మండల పరిషత్తు పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో వారి స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ మండలానికి జడ్పీ సీఈవో ఎం.సుధీర్‌ను నియమించగా, ధారూరు మండలానికి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె.మల్లేశం, కోట్‌పల్లి మండలానికి ముఖ్య ప్రణాళికాధికారి అశోక్, మర్పల్లి మండలానికి జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. బంట్వారం మండలానికి జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్, మోమిన్‌పేట్ మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, పరిగి మండలానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, దోమ మండలానికి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, కులకచర్ల మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబూ మోజెస్, పూడూరు మండలానికి జిల్లా పంచాయతీ అధికారి జయసుధలను ప్రత్యేకాధికారులుగా నియమించారు. కొడంగల్ మండలానికి జిల్లా అటవీశాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్, దౌల్తాబాద్ మండలానికి పశుసంవర్థక శాఖ ఏడీ సదానందం, బొంరాస్‌పేట్ మండలానికి సర్వే, ల్యాండ్ రెవెన్యూ ఏడీ ఎం.రాంరెడ్డి, తాండూరు మండలానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంఏ సత్తార్, పెద్దేముల్ మండలానికి గనుల శాఖ ఏడీ సత్యనారాయణ, యాలాల్ మండలానికి మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, బషీరాబాద్ మండలానికి జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావు, నవాబ్‌పేట్ మండలానికి జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌లను నియమించారు. మండల పరిషత్తు పాలకవర్గాల పదవీకాలం బుధవారం ముగియడంతో మండలాలకు నియమించిన ప్రత్యేకాధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా, జిల్లా ప్రజాపరిషత్తు పాలక వర్గం పదవీ కాలం గురువారం ముగియగా, పాలక వర్గం స్థానంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడితే శుక్రవారం జిల్లా కలెక్టర్ జడ్పీప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. పాలకవర్గాలకు ఉండే అధికారాలన్నీ ప్రత్యేకాధికారులకు ఉంటాయి. నిధుల కేటాయింపు, పనుల ఎంపిక తదితర వ్యవహారాలను ప్రత్యేకాధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుంది. పట్నం సునీతారెడ్డి వరుసగా మూడు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికై హాట్రిక్ సాధించారు. రెండు పర్యాయాలు రంగారెడ్డి జిల్లా నుంచి, ఒకసారి వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీ రాములు



ఆమనగల్లు, జూలై 4: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కలిసి చంద్రబాబు నాయుడును పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు మాజీ ఎంపీ రాములు తెలిపారు.

మతిస్థిమితం లేని గర్భిణీ సఖి సెంటర్‌కు తరలింపు


మతిస్థిమితం లేని మహిళను సఖి సెంటర్‌కు తరలిస్తున్న పోలీస్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది

చేవెళ్ల, జూలై 4 : మతిస్థిమితం లేని గుర్తుతెలియని 9 నెలల గర్భిణీని సఖి సెంటర్‌కు తరలించిన సంఘటన గురువారం చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గుర్తుతెలియని మహిళ మతిస్థిమితం లేకుండా ఎన్కెపల్లి పరసరాల్లో తిరుగుతుండటంతో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు గమనించి అంగన్‌వాడీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధకు సమాచారం అందించారు. ఆమె పోలీస్‌ల సహకారంతో ఎన్కెపల్లి గేట్ వద్దకు వెళ్లి గర్భిణీని సఖి సెంటర్‌కు వాహనంలో తరలించారు. కాగా, గర్భిణీ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదని, తెలుగు మాట్లాడటం రావడం లేదని అంగన్‌వాడీ అధికారులు తెలిపారు. పోలీస్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కలు, గ్రామస్తులు ఉన్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

కొడంగల్, జులై 4: కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను గురువారం ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ పాలనలో ఇప్పటికే 65సార్లు పేపర్ లీకేజీలు జరిగాయని ఆరోపించారు. ఇందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. పేపర్ లీకేజీలతో దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. నీట్‌పేపర్ లీకేజీలో అవకతవకలు జరిగాయని స్పష్టమవుతున్నా పార్లమెంట్‌లో దేశప్రధాని నరేంద్రమోదీ చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడు అశోక్, శేఖర్, శ్రీకాంత్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పేద రైతుల భూమిని తీసుకోవడం సరికాదు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కొడంగల్ రూరల్, జులై 4: అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను తీసుకోవద్దని, కొడంగల్‌లో ఉన్న 702ఎకరాల సీలింగ్ భూములు తీసుకొని అభివృద్ధి చేయాలని సామాజిక ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్థానిక ఐబీలో గురువారం వారు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు నెలల నుంచి కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామశివారులో గల సర్వే నెం.19లో సాగు చేసుకుంటున్న పేదల భూములను తీసుకుంటామని అధికారులు ఒత్తిడికి గురిచేయడం సరైంది కాదన్నారు. కొడంగల్‌లో ఉన్న 702ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ భూముల్లో మెడికల్, పారా మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడం పట్ల హర్షిస్తున్నామని, అయితే, పేద రైతులను అన్యాయానికి గురిచేసే విధంగా భూములను తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి అన్యాక్రాంతమైన సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, దేవినోనిగూడ వెంకటయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్ బాబు, చిన్నికృష్ణ, సూర్యనాయక్, మైలారం శ్రీనివాస్, రంగారెడ్డిపల్లి కిష్టయ్య, సర్వే నెం.19 భూ నిర్వాసితులు పకీరప్ప, అగ్గనూర్ మల్లేశ్, దుబ్బ బుగ్గప్ప, అమృతప్ప, కమలమ్మ, బుగ్గమ్మ పాల్గొన్నారు.


రోడ్డు పనులకు మరమ్మత్తులు చేస్తున్న నాయకులు

ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి

మొయినాబాద్, జూలై 4 : ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పీసీసీ అధికారి ప్రతినిధి గౌరి సతీష్ తెలిపారు. గురువారం మొయినాబాద్ మండలం నక్కపల్లి, ఎతుబార్‌పల్లి, తోలుకట్ట గ్రామలకు వెళ్లే రోడ్డుకు గౌరీసతీష్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. పుట్టిన ఊరును, కన్నతల్లిని ఎప్పటికీ మరవద్దన్నారు. గ్రామాలలోనే ప్రేమానురాలకు కొదువ ఉండదన్నారు. సొంత గడ్డకు సేవచేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. మూడు గ్రామాల ప్రజల అనుబంధం, ఐకమత్యంతోనే గ్రామలు అభివృద్ధి జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరింత సేవ చేసేందుకు ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణెయ్య, యువజన అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు బిక్షపతి, సత్యనారాయణ, గౌరి రవి, కృష్ణ, నర్సింలు, దేవదాస్, శ్రీకాంత్, రవి, రాజేశ్, జహంగీర్, బుచ్చయ్య, రాఘవేందర్, పెంటయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక శాఖకు దిక్సూచి రోశయ్య

షాద్‌నగర్, జూలై 4: ఆర్థిక శాఖకు దిక్సూచి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆయన 91వ జయంతిని పురస్కరించుకుని గురువారం షాద్‌నగర్ పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న ఆయన శిలా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక శాఖను గాడిన పెట్టిన ఘనత రోశయ్యకే దక్కుతుందని కొనియాడారు. 9సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీ, ఎమ్మెల్సీ పదవుల్లో ప్రభుత్వానికి వారధిగా ఉండేవారని చెప్పారు. పరిపాలనపై ఏమాత్రం పట్టులేని నేతలు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారని, వారంతా కూడా రోశయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. గత ఐదు సంవత్సరాలుగా రోశయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహస్తున్న వైశ్య సంఘం అధ్యక్షులు సరాపు రమేష్, ఆగీరు రవికుమార్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రతినిధులు నాగిళ్ల గోపాల్ గుప్తా, కల్వ యాదగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన కాంగ్రెస్ ప్రజాపాలన

- అభివృద్ధిని పక్కన పెట్టి.. ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై దృష్టి
- సబితారెడ్డి పార్టీ మారే ప్రసక్తే లేదు
- విలేకరుల సమావేశంలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసి.. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చేవెళ్ల మండలంలోని బర్కల రాంరెడ్డి ఫామ్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని, ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపైనే దృష్టి పెట్టిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌లో గెలిచిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లో చేరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, పార్టీ విడిచి పెట్టిపోయినంత మాత్రాన ఓటర్లు, కార్యకర్తలు ఆయన వెంట పోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 111ను ఎత్తివేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం జీవో పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను నివాసయోగ్య జోనల్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే యాదయ్య హైదరాబాద్-బీజాపూర్ రహదారి పనులు ప్రారంభించేలా పాటుపడాలని, నాలుగు లేన్ల విస్తరణ పనులు తొందరగా మొదలు పెట్టకుంటే ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీ మారే ప్రసక్తేలేదని, బీఆర్ఎస్ పార్టీలో.. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను కార్తీక్‌రెడ్డి కొట్టిపారేశారు. చేవెళ్ల, షాబాద్ మండలాల మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, అవినాష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.


కోనేరు మెట్లబావిని పరిశీలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

పురాతన కట్టడాలను కాపాడాలి

మహేశ్వరం, జూలై 4: పురాతన కట్టడాలను కాపాడాలని, భావితరాలకు ఉపయోగపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలపారు. గురువారం మండల కేంద్రంలోని మెట్లబావి(కోనేరు)ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రాచీన కట్టడం మెట్లబావి శిథిలావస్థకు చేరిన విషయం తెలుసుకొని మరమ్మతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. పనులు తుది దశకు చేరుకున్నట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మెట్లబావిని సాధ్యమైనంత త్వరగా సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సబితాఇంద్రారెడ్డి సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా చిలుకవాగు పనులు

- బీజేపీ నాయకుల ఆరోపణ


బీజేపీ నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

తాండూరు, జూలై 4: ఏళ్ల తరబడి ఉన్న వరద కష్టాలను చెక్ పెట్టేందుకు చిలుక వాగులో పూడికతీత కబ్జాలు తొలగించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ పనులకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. గురువారం చిలుకవాగులో ఇటాచీతో వరదనీరు నిల్వకుండా కాల్వను తవ్వే పనులను మున్సిపల్ అధికారులు, సిబ్బంది దగ్గరుండి చేపట్టారు. ఈ పనులను గురువారం పరిశీలించిన తాండూరు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి వెళ్లి తవ్వకాలను తూతూ మాత్రంగా చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాగు నాలా ఒకచోట ఉంటే మరో చోట నుంచి తవ్వకాలు చేస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం నర్సింహులు, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, కౌన్సిలర్ బాలప్ప, బీజేవైఎం నాయకులు కిరణ్, జగదీష్‌లు ఆరోపించారు. నాలా మార్గంలో అక్రమ నిర్మాణాలను వదిలేసి తవ్వకాలు చేస్తున్నారని, వెంటనే సర్వేచేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కాశీనాథ్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆర్అండ్‌బి డీఈ శ్రీనివాస్, తాండూరు, యాలాల రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని సర్వే చేసి ఆ ప్రకారమే తవ్వకాలు చేసేలా చూస్తామని తెలపడంతో బీజేపీ నేతలు అక్కడి నుంచి వెళ్లారు. తవ్వకాలను మున్సిపల్ యంత్రాగం చేపట్టింది. ఈ పనులు యుద్ధ ప్రతిపాదకన కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో వరద కష్టాలు తీరుతాయో? లేదో? వేచి చూడాలి.


ప్రారంభమైన చిలుక వాగు తవ్వకాలు

మండలాలకు ప్రత్యేకాధికారులు

ఈనెల 3న మండల పరిషత్‌ల పాలన ముగియడంతో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం స్పెషలాఫీసర్లుగా నియమించింది. ఈమేరకు వారు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వారికి కార్యాలయాల్లో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులతో వారు సమావేశమయ్యారు.


ఇబ్రహీంపట్నం : బాధ్యతలు స్వీకరించిన జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన ఎంపీడీవో వెంకటమ్మ, తదితరులు


కొత్తూర్ : బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీఏ లీన


కడ్తాల్ : అధికారులతో మాట్లాడుతున్న డీటీడీవో రామేశ్వరి దేవి


మంచాల : బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్డీవో ఏపీడీ సుభాషిణి


షాబాద్ : బాధ్యతలు స్వీకరిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి


కందుకూరు : బాధ్యతలు చేపట్టిన జిల్లా ఆడిట్ అధికారి వెంకట్‌కు స్వాగతం పలుకుతున్న ఎండీవో సరిత, తదితరులు


చేవెళ్ల : బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి


శంకర్‌పల్లి : ఏడీఏ రమాదేవికి పూల మొక్కతో స్వాగతం పలుకుతున్న అధికారులు


ఆమనగల్లు : ఏడీఏ సుజాతను సన్మానిస్తున్న ఎంపీడీవో మాధురి, సిబ్బంది


మొయినాబాద్ : బాధ్యతలు స్వీకరిస్తున్న హార్టికల్చర్ ఏడీ సంజయ్‌కుమార్


కేశంపేట : బాధ్యతలు స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారి ఏడీఏ రాజారత్నం

విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/యాచారం/శంషాబాద్/మొయినాబాద్‌రూరల్/చేవెళ్ల, జూలై 4:నీట్ పరీక్షల నిర్వాహణలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యా సంస్థల బంద్ ఆమనగల్లు పట్టణంలో విజయవంతమైంది. ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ విద్యా స ంస్థలు బంద్ పిలుపుతో మూసివేశారు. అనంతరం ఎన్ఎస్‌యుఐ నాయకులతో కలిసి తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయించారు. ఎన్ఎస్‌యుఐ కడ్తాల్ మండల అధ్యక్షుడు షాబొద్దీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఎన్ఎస్‌యుఐ మండలాధ్యక్షుడు రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు విప్లవ్‌కుమార్ ఆధ్వర్యంలో యాచారంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులు ప్రయణ్, వర్ధన్‌లు శంషాబాద్‌లో విద్యాసంస్థలను బంద్ చేయించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి. శంకర్ డిమాండ్ చేశారు. మొయినాబాద్ మండలంలోని ఇంజనీరింగ్ కళాశాలు, ఇతర విద్యాసంస్థలను మూసి వేయించారు. అనంతనం ఆయా కళాశాలల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఐక్య కార్యచరణ జాతీయ కమిటీ విద్యా సంస్థల భారత్ బంద్ పిలుపులో భాగంగా చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ చేశారు. పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, కార్యదర్శి అనుస్, మండలాధ్యక్షుడు జైపాల్, ఉపాధ్యక్షుడు ఎన్.ఆశోక్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఆశోక్, నాయకులు తదితరులున్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, జూలై 4 : స్వామి వివేకాందను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, మండల యువ నాయకులు వైభవ్‌రెడ్డి తెలిపారు. గురువారం వివేకాందన వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆయన విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు తదితరులున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండల సీనియర్ నాయకుడు బైకని కుమార్ మండలంలోని హిమాయత్ నగర్‌లో వివేకనందుడి విగ్రహానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి నివాళి అర్పించారు.

యాదయ్య కుటుంబానికి అండగా ఉంటాం


యాదయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రీతమ్

కడ్తాల్, జూలై 4 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ముద్విన్ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నగరిగారి ప్రీతమ్ అన్నారు. యాదయ్య కుటుంబానికి కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన యాదయ్య కుటుంబ సభ్యులైన సువర్ణ, జగన్, హర్షవర్ధన్, మైసమ్మలను గురువారం నగరిగారి ప్రీతమ్ పరామర్శించారు. యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ పరంగా తగిన సాయం అందేలా చూస్తామని చెప్పారు. అంతకు ముందు ఆయన కడ్తాల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేశారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు యాట నర్సింహ, పొతుగంటి అశోక్, రామకృష్ణ, కాలె వెంకటేష్, నారాయణ తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది

- ప్రజాప్రతినిధులు
- ఆయన వర్ధంతి సందర్భంగా నివాళి

మహేశ్వరం, జూలై 4: తెలంగాణ సాయుధ పోరటంలో దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువత, తెలంగాణ ప్రజలు మరువలేనిదని, అలాంటి వ్యక్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబయ్య యాదవ్, సుధీర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో కొమురయ్య విగ్రహం వద్ద పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతొరెడ్డి, యువ నాయకులు మల్గారి వైభవ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభు


మహేశ్వరం: దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

లింగం, మండలప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సుధాకర్‌గౌడ్, మగ్బుల్, కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, చేవెళ్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు సున్నపు వసంతంలు నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాములు, తదితరులు ఉన్నారు.

షాబాద్ : భూమికోసం, భుక్తికోసం, తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరుడు దొడ్డి కొమురయ్య అని కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరి పాండు అన్నారు. షాబాద్‌లో ఆయన చిత్రపటానికి కురుమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంఘం నాయకులు మద్దూరి మల్లేష్, క్యామ నారాయణ, బర్క నరేందర్, మేకల శ్రీనివాస్, రాపోల్ నర్సింహులు, బండ కృష్ణ, మహేందర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : దొడ్డి కొమురయ్యను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీసీ సంఘం జిల్లా నాయకులు ఎగ్గిడి సత్తయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎగ్గిడి చిన్న ఐలయ్య, ఎగ్గిడి జగదీష్, బద్క ఐలయ్య, బండ ఆంజనేయులు, గౌర ప్రభాకర్, కంద పెద్ద నర్సింహ్మా, గౌర పాండు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : దొడ్డి కొమురయ్య వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఛండీశ్వర కురుమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఎదుట కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ లు ముఖ్య అతిథులుగా హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు క్యామ రాజేశ్, బండ శ్రీను, పిప్పళ్ల యాదయ్య, చిందం వెంకటేశ్, పెంటయ్య, వెంకటేశ్, జల్కం రమేశ్, క్యామ మహేశ్, తదితరులున్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు

- ప్రజాప్రతినిధులు, అధికారులు

కందుకూరు, జూలై 4: రాజకీయాలకు అతీతంగా పనిచేసిన ప్రజాప్రతినిధులకు అన్ని వర్గాల ప్రజల నుంచి గుర్తింపు ఉంటుందని.. మహిళా ప్రజాప్రతినిధుల పదవికాలం ముగిసినా ప్రజా సేవలో ముందుకు సాగాలని ఆర్డీవో సూరజ్‌కుమార్ కోరారు. గురువారం ఎంపీపీ మంద జ్యోతి, అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం దెబ్బడగూడ, మీర్కాన్‌పేట ఎంపీటీసీలు ఎల్మటి లక్ష్మి, కాకి రాములు మాట్లాడారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా వచ్చే ఎంపీటీసీకి కనీసం గ్రామ పంచాయతీల్లో చాంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ జ్యోతి, జడ్పీటీసీ జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, అధికారులు తదితరులున్నారు.

తలకొండపల్లి : ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారిని ప్రజలు ఆదరిస్తారని ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేశ్, సుధాకర్‌రెడ్డి, అంబాజీ, హేమరాజు, సోని, ఇమ్రాన్, పెంటమ్మ, సునితలకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషలాఫీర్ ఎ.ముత్యాలు, ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్


కడ్తాల్ : జడ్పీటీసీ దశరథ్, వైస్ ఎంపీపీ ఆనంద్ లను సన్మానిస్తున్న నాయకులు

రంగారెడ్డి, ఎస్సై శ్రీకాంత్, తదితరులున్నారు.

కడ్తాల్ : పదవులు ఉన్నా లేకున్న నిరంతరం ప్రజల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడ్తాల జడ్పీటీసీ దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ బావండ్ల పల్లి ఆనందలు అన్నారు. మండల దశరథ్ నాయక్,ఆనంద్‌లకు పలువురు నాయకులు, వివిధ సంఘాల నేతలు, అభిమానులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు తదితరులున్నారు. ఎంపీపీ కమ్లీమోత్యానాయక్‌కు మైసిగండిలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్విన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

కొత్తూర్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని.. అండంగా ఉంటామని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు భరోసా కల్పించారు. జడ్పీటీసీ, జడ్పీ వైద్య, విద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఎమ్మె శ్రీలతసత్యనారాయణ పదవీ వీడ్కోలు సందర్భంగా మండల పరిధిలోని జేపీ దర్గా వద్ద ఆత్మీయసమ్మేశనం నిర్వహించారు. ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా హాజరైనారు. జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణను ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యేతో పాటు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ఆమె అభిమానులు భారీయెత్తున తరలివచ్చి శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. జడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, మెండె కృష్ణ, కళ్లెం నర్సింహారెడ్డి, ఆశోక్, పద్మారావు, అజయ్ మిట్టునాయక్, తదితరులున్నారు.


తలకొండపల్లి : వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో మండల పరిషత్ పాలకవర్గం

మొయినాబాద్ : ప్రజల్లో ఉంటూ సేవచేసే నాయకులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాజా మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపీటీసీల సన్మాన కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు. ఎంపీడీవో సంధ్య, ప్రత్యేకాధికారి సంజయ్‌కుమార్, వ్యవసాయ అధికారి రాగమ్మ, తాజా మాజీ ఎంపీపీ నక్షత్రంజైవంత్, వైస్ ఎంపీపీ మమత, జడ్పీటీసీ శ్రీకాంత్, తాజామాజీ ఎంపీటీసీలు అర్చన, లక్ష్మమ్మ, లత, శ్రీనివాస్, మల్లేష్, రాంరెడ్డి, రవిందర్‌రెడ్డి, అర్జున్, రితీష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బిలాల్ తదితరులున్నారు.


మొయినాబాద్ : సన్మాన కార్మక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు


కందుకూరు: ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీపీ మంద జ్యోతి, ఎండీవో సరిత


కొత్తూర్ : శ్రీలతసత్యనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, అంజయ్యయాదవ్

సంక్షిప్తంగా..

చౌదరిగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా గతంలో లబ్ధిదారులు ఇచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ గృహజ్యోతి కింద చాలా మంది లబ్ధిదారులకు జీరో బిల్లులు రాక పోవడంతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గత 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు క్యూ కట్టారు.

కొత్తూర్ : మండలంలోని ఆయా పాఠశాలలు, గ్రామాల మౌళిక సదుపాయాల కోసం 31.50లక్షల రుపాయల జడ్పీ నిధులు విడుదల అయ్యాయని జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రామాల నాయకులకు ఇచ్చారు.

కందుకూరు : మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి, రాచులూరు, లేమూరు గ్రామాల పశువైద్యాధికారులు షాయిన్ షేక్, సంధ్యారాణిలు మండల కేంద్రంలో గత 25సంవత్సరాలుగా అబార్‌గా పనిచేసిన యాదమ్మ పదవి విరమణ సన్మాన సభను కొత్తూరు గేటు వద్ద గల సత్యనారాయణ గార్డెన్‌లో నిర్వహించారు. హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి జంగారెడ్డి, మండల పశు వైద్యసిబ్బంది జంగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పందులు కొంత కాలంగా స్వైర విహారం చేస్తున్నాయి. స్థానికులు ఎంపీడీవో కుసుమ మాధురి దృష్టికి తీసుకుపోయారు. ఎంపీడీవో కమిషనర్ వసంతను ఆదేశించగా గురువారం పందులను తొలగింపుకు చర్యలు చేపట్టారు.

యాచారం : అధికారంలో లేకపోయినా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎంపీపీ సుకన్యబాషా తెలిపారు. ఇటీవల కేంద్ర నుంచి మండలానికి రూ.4కోట్ల50లక్షల నిధులు రాబట్టానన్నారు.

చేవెళ్ల : హిందువులను అవహేళన చేసిన పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడినందున చేవెళ్లలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను ఆయన దహనం చేశారు.

క్రైం కార్నర్

తల్లితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

కందుకూరు, జూలై 4: కల్యాణం చేసుకొని ఆరుకాలాలు జీవించాలని భావించిన భర్తకు.. భార్య, అత్తలు యమపాశంగా మారారు. తల్లితో కలిసి భార్య తన భర్తను కడతేర్చిన విషాద ఘటన మండలంలోని కొత్తగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు.. కొత్తగూడకు చెందిన గాందడి చుక్కమ్మ తన భర్తను వదిలి కూతుళ్లతో కలిసి గ్రామంలోనే నివసిస్తోంది. పెద్ద కూతురిని నగరంలోని మల్లేష్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆ ఇద్దరిని కొత్తగూడ గ్రామంలో స్థిరపడేలా ఉపాధి కల్పించిన చుక్కమ్మ.. చిన్న కూతురు స్వప్నను 12 ఏళ్ల క్రితం నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన కంచకుంట్ల పరమేష్(37)తో వివాహం జరిపించింది. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆ కుమార్తెలు పుట్టినప్పటి నుంచి పరమేష్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండేవాడు. భార్యను తరచూ కొట్టేవాడు. ఈక్రమంలో స్వప్న రెండు సంవత్సరాల నుంచి భర్తను వదిలి అమ్మ సుక్కమ్మ వద్ద స్థిరపడింది. ఈ విషయంపై పరమేష్ మూడు నెలల క్రితం భార్యపిల్లలను తనతో పంపించడంలేదని కందుకూరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం సాయంత్రం తన ఇద్దరు పిల్లలు, భార్యను తనతో పంపాలని అత్త సుక్కమ్మతో విభేదించాడు. దాంతో స్వప్న, చుక్కమ్మలు బుధవారం రాత్రి పరమేష్‌పై దాడి చేసి హత్యచేశారు. మృతదేహాన్ని చుక్కమ్మ ఇంటికి 50మీటర్ల దూరంలో పడేయడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు సీఐ సీతారాంలు క్లూస్‌టీమ్‌ను రప్పించారు. విచారణానంతరం పరమేష్ భార్య, అత్తలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. పరమేష్‌ను హత్య చేసింది కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని చుక్కమ్మ బంధువులైన లక్ష్మయ్య, లలితలు ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఇబ్రహీంపట్నం చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, జూలై 4: ఇబ్రహీంపట్నం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. శవంపై నీటిపై తేలియాడుతుండగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకుతీసి స్థానిక సీహెచ్‌సీ మార్చురీలో భద్రపరిచారు. కాగా, మృతుడి వయస్సు 55-60 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై తెల్లచొక్కా, బూడిద రంగు ప్యాంటు ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై మారయ్య తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

శంకర్‌పల్లి, జూలై 4: శంకర్‌పల్లిలోని ఇంద్రారెడ్డి స్టేడియం వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఇంద్రారెడ్డి స్టేడియంలో గల ఓ గదిలో ఉంటూ భీమయ్య (65) అనే వృద్ధుడు చెత్త ఏరుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా, డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద ఉండే సెక్యూరిటీ గార్డు సుగార్‌సింగ్ భీమయ్యలు ప్రతీ రోజు ఆ ప్రాంతంలో ఉండే ఓ టీ స్టాల్‌లో టీ తాగేవారు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం టీ తాగేందుకు భీమయ్య రాకపోవడంతో సుగార్ సింగ్ స్టేడియంలోని భీమయ్య గది వద్దకు వెళ్లి చూశాడు. అప్పటికే భీమయ్య రక్తం మడుగులో పడి ఉండటం గమనించి డయల్ 100కు ఫోన్ చేశాడు. సీఐ హబీబుల్లా ఖాన్ సిబ్బందితో వెళ్లి శవాన్ని పరిశీలించారు. భీమయ్య గొంతు కోసి ఉందని, చేతిలో కత్తి ఉందని తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయాడని పోలీసులు నిర్ధారించారు. అయితే, ఎవరైనా చంపేసి చేతిలో కత్తి పెట్టి ఉంటారా? ఆయనే కత్తితో గొంతు కోసుకుని చనిపోయాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. భీమయ్య కూతురు కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. స్వగ్రామం ఎక్కడనేది ఎవరికీ తెలియదు.

కొంగర కలాన్‌లో 6 గొర్రెలు అపహరణ

ఆదిభట్ల, జూలై 4 : గుర్తుతెలియని దుండగులు షెడ్డులోకి చొరబడి 6 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి కొంగరకలాన్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంగర కలాన్‌కు చెందిన దండిగ పాండు తన వ్యవసాయ పొలంలో షెడ్‌వేసి 100 గొర్రెలను పెంచుతున్నాడు. ఈనెల 2న సాయంత్రం గొర్రెలను షెడ్‌లోకి తోలి ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి రాత్రి 10 గంటలకు షెడ్‌కు వచ్చి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం 10గంటల ప్రాంతంలో మేతకోసం వెళ్తున్న సమయంలో 5 గొర్రెలు 1 పొట్టేలు కనిపించలేదు. రాత్రి భోజనం కోసం వెళ్లినప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దాంతో అతడు గురువారం ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన గొర్రెల విలువ సుమారు రూ.38 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం


యాచారం, జూలై 4 : అక్రమంగా నిల్వచేసిన పేలుడు పదార్థాలను యాచారం మండలంలోని కొత్తపల్లిలో రాచకొండ ఎస్వోటీ బుధవారం రాత్రి పట్టుకుంది. కొత్తపల్లికి చెందిన వెంకటయ్య, రవిలు తమ పంట పొలంలో ఉన్న భారీ బండరాళ్లను ధ్వంసం చేసి పంటభూమిని వినియోగంలోకి తేవడానికి పేలుడు పదార్థాలను నగరంలో కొనుగోలు చేశారు. ముందుగా పోలీసుల అనుమతి తీసుకోకుండా కొనుగోలు చేసి నిల్వచేసినట్లు ఎస్వోటీకి పక్కా సమాచారమందింది. దాంతో దాడిచేసి 18 డిటోనేటర్లు, 68 జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

ప్రజా నిర్ణయం మేరకే 'రైతు భరోసా' అమలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్


ఆమనగల్లు : మాట్లాడుతున్న వెంకటేశ్

కొందుర్గు/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు, జూలై 4: ప్రజల నిర్ణయం మేరకే రైతు భరోసాను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపలి శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల రైతులతో రైతు భరోసాపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసాపై రైతులు, ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు గాను సమీక్ష సమావేశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులందరూ దాదాపు 80 శాతం మంది.. 10 ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్, మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చైర్మెన్ దామోదర్‌రెడ్డి, నాగలింగాచారి, సరస్వతి, తదితరులున్నారు. ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరిగూడ పీఏసీఎస్ ప్రత్యేక సమావేశం శేరిగూడలోని సంఘ భవనంలో సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి ధాత్రీదేవి పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసాకు సంబంధించి రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఐదెకరాల లోపు రైతులకు మాత్రమే రైతు భరోసా అందించాలని కొందరు, పదెకరాల వరకు ఇవ్వాలని మరికొందరు ప్రస్తావించారు. రైతు భరోసాపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఐటీ కడుతున్న రైతులకుకూడా దీనిని వర్తింపజేయాలని రైతు నాయకుడు మొద్దు అంజిరెడ్డి అన్నారు. అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు డీసీవో ధాత్రీదేవి తెలిపారు. సమావేశంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పంటలు సాగు చేసే భూములన్నింటికి రైతుభరోసా సాయం అందించి ఆదుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. డీఆర్ఏవో నాగలింగాచారి,డీఎల్‌సీవో శారద తదితరులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో ధాత్రీదేవి